ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
ఆదివారం 14 జూలై 2024



అనంతగిరి ఘాట్‌లో డ్రంకెన్ డ్రైవ్

ధారూరు, జూలై 13: అనంతరగిరి ఘాట్ దిగువ ప్రాంతంలో శనివారం పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్, వాహనాల తనిఖీలు చేపట్టారు. వారాంతపు సెలవులలో అనంతగిరి కొండలకువివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు పెద్ద ఎత్తున వస్తుండటంతో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎస్‌ఐ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. , మద్యం సేవించి వాహనం నడిపితే కేసులు నమోదు చేస్తామని ఆయన చెప్పారు.

దేవాదాయ శాఖలో ఉద్యోగుల బదిలీలపై కసరత్తు

- ఇప్పటికే అధికారులు, సిబ్బంది, అర్చకుల వివరాల సేకరణ
- రెండు, మూడు రోజుల్లో ట్రాన్స్‌ఫర్లపై రానున్న స్పష్టత
- ఉమ్మడి రంగారెడ్డి పరిధిలో 630 ఆలయాలు
- విధుల్లో 230 మంది వరకు ఉద్యోగులు, అర్చకులు

వికారాబాద్, జూలై13 (ఆంధ్రజ్యోతి) : దేవాదాయ, ధర్మాదాయ శాఖలో బదిలీలకు రంగం సిద్ధమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీలకు అనుమతించడంతో దేవాదాయ శాఖలోనూ ఉద్యోగుల బదిలీలు నిర్వహించేందుకు కసరత్తు ప్రారంభించారు. దేవాదాయ శాఖలో దేవాలయాలు, కార్యాలయాల్లో నాలుగేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులను బదిలీ చేసేందుకు సంబంధితశాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఉద్యోగులతో పాటు అర్చకులను కూడా బదిలీ చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. బదిలీల పరిధిలోకి వచ్చే అధికారులు, ఉద్యోగులు, అర్చకుల వివరాలను ఇప్పటికే ఆ శాఖ అధికారులు సేకరించారు. కిందిస్థాయి నుంచి వచ్చిన సమాచారంతో తమ వద్ద ఉన్న వివరాలను సరి చూసుకునే ప్రక్రియ కొనసాగుతోంది. ఉమ్మడి రంగారెడ్డి పరిధిలో 630 దేవాలయాలు ఉండగా, 230 మంది వరకు ఉద్యోగులు, అర్చకులు పనిచేస్తున్నట్లు సమాచారం. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉమ్మడి జిల్లా పరిధిలో వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలు వస్తాయి. ఈ దేవాలయాల్లో 6ఏ విభాగంలో 19 ఉండగా, 6బీ కింద 41, 6సిలో 570 దేవాలయాలు ఉన్నట్లు చెబుతున్నారు. ఈ దేవాలయాల్లో ధూపదీప నైవేద్య పథకం కింద ఎంపిక చేసిన దేవాలయాలు కూడా కొన్ని ఉన్నాయి.



తప్పనిసరి బదిలీలకే అవకాశం

ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం దేవాదాయ, ధర్మాదాయ శాఖలో తప్పనిసరిగా బదిలీలు జరిగే వారితో పాటు బదిలీలు కోరుకున్న ఉద్యోగులు కూడా దరఖాస్తు చేసుకున్నారు. తప్పనిసరిగా బదిలీలు జరిగే వారిలో, బదిలీలుకోరుకునే ఈవోలు, మేనేజర్లు, ఉద్యోగులు ఉండగా, ఈసారి కొత్తగా అర్చకుల వివరాలు కూడా సేకరించడం చర్చనీయాంశంగా మారింది. ఈసారి బదిలీల్లో దేవాదాయ శాఖలో పనిచేసే మొత్తం ఉద్యోగుల్లో 40శాతం మందికి మాత్రమే స్థాన చలనం జరగనుంది. చాలా కాలంగా ఒకే చోట కొనసాగుతున్న ఉద్యోగులు, అర్చకులు బదిలీ అయ్యే అవకాశం ఉండగా, ఉమ్మడి జిల్లా పరిధిలో 80 నుంచి 95 మంది వరకు ఉద్యోగులు బదిలీ కావచ్చని తెలుస్తోంది. ఒకే దేవాలయంలో నాలుగేళ్లకు పైగా పనిచేస్తున్న వారిని బదిలీల జాబితాలో చేర్చినట్లు సమాచారం.

చర్చనీయాంశంగా మారిన అర్చకుల బదిలీలు?

దేవాలయాల్లో అర్చకుల నియామకం జరిగినప్పటి నుంచి చాలా వరకు వారు ఒకే చోట కొనసాగుతున్నారు. సాధారణంగా అర్చకులు ఏ దేవాలయంలో అర్చక సేవలు అందిస్తూ ఉంటే ఆ దేవాలయంలోనే వారిని ఇంత వరకుకొనసాగిస్తూ వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈసారి దేవాదాయ శాఖ కార్యాలయాలతో పాటు దేవాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకుల వివరాలు కూడా సేకరించడం ఆ శాఖలో చర్చకు దారితీసింది. ఒక్కో దేవాలయంలో ఒక్కో ఆగమ శాస్త్రం ప్రకారం పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఒకదేవాలయంలో ఓ ఆగమ శాస్త్రం ప్రకారం పూజలు నిర్వహించే అర్చకుడు మరోఆగమ శాస్త్రం ప్రకారం పూజలు నిర్వహించే మరో దేవాలయానికి బదిలీ చేస్తే ఎలా అన్న అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఓదేవాలయంలో అర్చక సేవలు అందిస్తున్న అర్చకులను మరో దేవాలయానికి బదిలీ చేసే అంశాన్ని విరమించుకోవాలన్న డిమాండ్ అర్చకుల నుంచి వ్యక్తమవుతోంది.

గృహజ్యోతికి దరఖాస్తు చేసుకోవాలి

- కలెక్టర్ ప్రతీక్ జైన్



వికారాబాద్, జూలై 13 : గృహజ్యోతి (200 యూనిట్ల లోపు విద్యుత్తు) పథకానికి అర్హులైన వారు ప్రజాపాలన సేవాకేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. లబ్ధిదారులు ఇల్లు మారినప్పుడు, విద్యుత్తు మీటర్ యూనిక్ సర్వీస్ నంబర్ అనుసంధానంలో లోపాల వల్ల ప్రయోజనాలు పొందలేని వారు వివరాలు సవరించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతో వివిధ పథకాలకు ప్రజాపాలనలో అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. గృహజ్యోతి కింద విద్యుత్‌బిల్లు, గ్యాస్ సిలిండర్‌కు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా అందనట్లైతే రేషన్ కార్డు, విద్యుత్ బిల్లు, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు లు, దరఖాస్తు చేసుకున్న రసీదుతో పాటు ప్రజాపాలన సేవా కేంద్రాల వద్దకు వెళ్లి దరఖాస్తులో ఉన్న తప్పులను సరి చేసుకోవాలన్నారు.



నారం చెరువు పరిసరాల్లో కడీలు పాతి డంపింగ్ చేసిన మట్టి

దర్జాగా కబ్జా!

ఆక్రమణలకు కేరాఫ్ గుండ్లపోచంపల్లి

నగర శివారులో భూముల ధరలకు రెక్కలు రావడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టి అందినకాడికి దండుకుంటున్నారు. చెరువులు, కుంటల పరిరక్షణ కోసం ప్రభుత్వం ఒకవైపు కొత్త చట్టాలు తీసుకొస్తుండగా, మరోవైపు భూ బకాసురులు ప్రభుత్వ భూములనూ వదడలం లేదు. రాత్రికి రాత్రే నిబంధనలను అతిక్రమించి ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు చేపట్టి విక్రయిస్తున్నారు. నగరానికి అనుకుని ఉన్న గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ భూ కబ్జాదారులకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఇంత తతంగం జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

- హైరేంజ్ జోన్ పరిధిలో మున్సిపల్ భూములు
- రాత్రికి రాత్రే చెరువులో యథేచ్ఛగా వెలుస్తున్న ప్లాట్లు
- ప్రభుత్వ భూములు రికార్డులకే పరిమితం
- ఎఫ్‌టీఎల్‌లో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

మేడ్చల్ టౌన్, జూలై 13: చెరువులు, కుంటల పరిరక్షణ కోసం ప్రభుత్వం ఒక వైపు కొత్త చట్టాలు తీసుకొస్తుండగా, మరోవైపు భూ బకాసూరులు ప్రభుత్వ భూములనూ వదడలం లేదు. రాత్రికి రాత్రే నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లుగా మార్చి అమ్ముకుంటున్నారు. నగరానికి అనుకుని ఉన్న గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ భూ కబ్జాదారులకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. మున్సిపల్ పరిధిలోని భూములు హెచ్‌ఎండీఏ మాస్టర్‌ప్లాన్‌లో హైరేంజ్ జోన్‌లో ఉండటంతో రియల్టర్లు ఈప్రాంతం భూములపై కన్నేశారు. తమ దందాను మూడు పువ్వులు ఆరుకాయల్లా కొనసాగిస్తున్నారు. స్థానికంగా ఉన్న చెరువులు రియల్టర్ల చేతిలో కబ్జాకు గురవుతున్నాయి. పరిరక్షించండి మహాప్రభో అంటూ స్థానికులు మొరపెట్టుకుంటునప్పటికీ చర్యలు తీసుకునే నాథుడే కరువయ్యాడు. పదేళ్లుగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి రోజురోజుకూ విస్తరిస్తోంది. కొత్తగా వెంచర్లు, బహుళ అంతస్తులతో పెద్దఎత్తున భవనాలు వెలుస్తున్నాయి. ఇదే అదనుగా రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు ఇక్కడి భూములపై నజర్ పడింది. దీంతో పట్టా భూములు కొనుగోలు చేసి వెంచర్లు, లేఔట్‌లు, బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం కొత్త ప్రాజెక్టులకు భూముల కొరత ఏర్పడింది. ఈ క్రమంలో రియల్టర్లు చెరువులు, కుంటలు సమీపంలోని పట్టా భూములతో పాటు, ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లేవల్) భూములను కొనుగోలు చేస్తున్నారు. చెరువు సమీపంలోని ఎఫ్‌టీఎల్ భూముల్లో రాత్రికి రాత్రే మట్టిని డంప్ చేసి చెరువును పూడ్చేస్తున్నారు. అయితే నిబంధనల ప్రకారం ఎఫ్‌టీఎల్‌లో పంట పండించుకోవాలే తప్పా, ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. ఇక్కడ అ నిబంధనలను తుంగలో తొక్కుతూ రియల్టర్లు కొత్త వెంచర్లు ప్రారంభిస్తున్నారు. ఫలితంగా గుండ్లపోచంపల్లి పరిధిలో రెవెన్యూ రికార్డుల పరంగా నాలుగు చెరువుల భూములు కబ్జాకు గురై ప్లాట్లుగా మరుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై స్థానికులు సంబంధిత ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ తూతూమంత్రంగా దర్యాప్తు చేసి వదిలేస్తున్నారు. ఫలితంగా కబ్జాకు పాల్పడే వారు రేయింబవళ్లు చెరువు అంచుల్లోని భూముల్లో మట్టి, రాళ్లు, రప్పలు డంపింగ్ చేసి చెరువును పూడ్చేస్తున్నారు.



చెరువు ఎఫ్‌టీఎల్‌లో రియల్టర్లు పోయించిన మట్టి

కనుమరుగవుతున్న చెరువులు

గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెంబర్ 130లో 11.4 ఎకరాల్లో నార చెరువు విస్తరించి ఉంది. కాగా ఈ చెరువు పట్టణం నడిబొడ్డున ఉన్నందున చెరువు చుట్టూ ఎఫ్‌టీఎల్ భూములను రియల్టర్లు కొనుగోలు చేసి ప్లాట్లుగా మార్చి అమ్మేస్తున్నారు. ప్రస్తుతం నేరుగా ఈ చెరువును పూడ్చే పనుల్లో కొందరు నిమగ్నమయ్యారని స్థానికులు పేర్కొంటున్నారు. పట్టపగలే చెరువును పూడ్చే పనులు జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ పరిధిలోని మైసమ్మగూడలోని సర్వే నెంబర్ 647లో కోమటికుంట చెరువు పరిధిలో 20.8 ఎకరాల భూములు ఉండగా ఈ చెరువు పరిసరాల్లోని ఎఫ్‌టీఎల్ భూమిలో రోడ్డును ఏర్పాటు చేసి కబ్జాకు పాల్పడుతున్నారు. మున్సిపల్ పరిధిలోని కాజిగూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 29లో చెరువు పరిధిలో 14.3 ఎకరాల స్థలం ఉండాలి.. కాగా ఈ చెరువు చుట్టూ కొందరు రియల్టర్లు మట్టిని డంపింగ్ చేసి చెరువు ఉనికిని దెబ్బ తీస్తున్నారు. గతంలో ఈ చెరువు పరిసరాల్లో మట్టిని డంపింగ్ చేసి నిర్మాణాలు చేపట్టగా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు కంటితుడుపు చర్యగా నిర్మాణాలు తొలగించి చెరువు పరిరక్షణ గురించి పట్టించకోవటం మానేశారు. సర్వే నెంబర్ 428లో ఉన్న 5.38 ఎకరాల్లో విస్తరించిన నీలం చెరువు కబ్జాలతో కబ్జాలతో కనుమరుగవుతోంది. సర్వే



మట్టి వేసి చెరువును పూడుస్తున్న ట్రాక్టర్

నెంబర్ 494 లోని సోకాయ కుంటకు చెందిన 4.29 ఎకరాల శిఖం భూమికి ప్రస్తుతం రక్షణ కరువయ్యింది. ఈ విషయం పట్ల స్థానికులు పలు మార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన కరువయ్యింది. అదే విధంగా గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 380లోని 1.7 ఎకరాలు, సర్వేనెంబర్ 358లోని 38 గుంటలు రెవెన్యూ రికార్డులో కనబడుతున్నప్పటికీ భూమి ఎక్కడుందన్న విషయం రెవెన్యూ అధికారులకే తెలియని పరిస్థితి నెలకొంది.

రియల్టర్లకు రాజకీయ అండదండలు

గుండ్లపోచంపల్లి రెవెన్యూపరిధిలో జరుగుతున్న చెరువులు, కంటల కబ్జాల వెనుక స్థానికంగా ఉన్న కొందరు రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. భూముల విలువ రూ. కోట్లలో ఉండడంతో సమస్యాత్మకమై భూములను రియల్టర్లు కొనుగోలుచేసి స్థానిక రాజకీయ నాయకుల ప్రమేయంతో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఎఫ్‌టీఎల్‌లో అక్రమనిర్మాణాలకు తెరలేపుతున్నారు. నగర శివార్లలోని చెరువులను రక్షించే దిశలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తున్నప్పటికీ మున్సిపల్ పరిధిలోని నాలుగు చెరువులకు రక్షణ కరువైందని స్థానికులు వాపోతున్నారు. చెరువులు, కుంటల కనుమరుగు విషయమై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం గమనార్హం.



బస్సులో కూరగాయలు విక్రయిస్తున్న మహిళా రైతు మణెమ్మ

ఫ్రీ బస్సులో కూరగాయల గిరాకీ

- నాయినోనిపల్లికి చెందిన ఓ మహిళా రైతు అమ్మకం
- సోషల్ మీడియాలో వైరల్

మహిళలకు తెలంగాణ ప్రభుత్వం కల్పించిన ఫ్రీ బస్సు సౌకర్యం అనేక విధాలుగా ఉపయోగపడుతోంది. అయితే కూరగాయాలు విక్రయించే మహిళా రైతులు బస్సు ప్రయాణాన్ని తమ అమ్మకాల కోసం కూడా ఉపయోగించుకుంటున్నారు. మూడు రోజులు క్రితం మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం నాయినోనిపల్లి గ్రామానికి చెందిన మహిళా రైతులు మహబూబ్‌నగర్‌లో కూరగాయలను విక్రయించారు. మిగిలిన కూరగాయలతో వారు రాత్రి 8:30 గంటల ప్రాంతంలో తిరిగి మహబూబ్‌నగర్ నుంచి పరిగి వెళ్లే బస్సులో ఇంటికి బయలుదేరారు. బస్సులో వారితో పాటే ప్రయాణిస్తున్న ఓ మహిళ మిగిలిన కూరగాయలను చూసి తనకు కావాలని మహిళా రైతు మణెమ్మను కోరగా ఆమెకు బెండకాయలు అమ్మింది. సదరు మహిళ వెంట కూరగాయల గంపలు తెచ్చుకుని బస్ ఎక్కిన ప్రయాణికులకు తూకం వేస్తూ విక్రయించింది. ఆ దృశ్యాన్ని బస్సు కండక్టర్, మరికొందరు ప్రయాణికులు వీడియోల్లో బంధించారు. ఆ వీడియోలు శనివారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

- పరిగి, జూలై 13

గుర్రపు డెక్క తొలగింపు

ఘట్‌కేసర్, జూలై 13: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ మీరాలం కుంటలో ఇన్ఫోసిస్ సంస్థ ఆధ్వర్యంలో గుర్రపుడెక్క తొలగింపు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా శనివారం ఆకుల తొలగింపు పనులు చేపట్టారు. సంస్థ ప్రతినిధులతో కలిసి మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి మాట్లాడుతూ మీరాలం కుంటలో పేరుకుపోయిన చెత్తాచెదారంతోపాటు గుర్రపుడెక్కను తొలగించే పనులను చేపట్టడం అభినందనీయమన్నారు. ఇటీవల మున్సిపాలిటీ పాలకవర్గం ఆధ్వర్యంలో సంస్థ ప్రతినిధులను కలిసినపుడు ఇచ్చిన హామీ మేరకు పనులు చేపట్టారని గుర్తు చేశారు. మీరాలం కుంటలోకి మురుగునీరు కలువకుండా త్వరలో పనులు చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ నానావత్‌రెడ్డియానాయక్, కమిషనర్ వేమన్‌రెడ్డి, కౌన్సిలర్ గొంగళ్ల మహేష్‌నాయకులు, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



గుర్రపుడెక్క తొలగింపు పనులపై చర్చిస్తున్న కొండల్‌రెడ్డి

మిషన్ భగీరథ నీటిలో వానపాములు

- కంగుతిన్న శాంతినగర్ వాసులు
- నిర్లక్ష్యం వీడని మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు

తాండూరు, జూలై13: ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలనే ఉద్దేశంతో ప్రారంభించిన మిషన్ భగీరథ నీటి సరఫరా పథకం అధికారుల నిర్లక్ష్యంతో ఉద్దేశాన్ని చేరుకోవడం లేదు. నల్లాల ద్వారా సరఫరా అవుతున్న నీటిలో వానపాములు వస్తున్నాయి. శనివారం తాండూరు మున్సిపాలిటీ శాంతినగర్ కాలనీలో సరఫరా అయిన మిషన్‌భగీరథ నీటిలో వానపాములు వచ్చాయి. మాజీ కౌన్సిలర్ అనురాధ ఇంట్లో నీరు దుర్వాసనతో సరఫరా అయింది. ఆ నీటితో వానపాములు కూడా వచ్చాయి. దీంతో కాలనీ వాసులు కుంగుతిన్నారు. ముందే వానాకాలం... సీజన్ వ్యాధులు ప్రబలుతున్న సమయంలో ఇలాంటి తాగునీటిని వదిలితే ప్రజలు రోగాల బారిన పడరా.. అని ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని కాలనీల ప్రజలు వాపోతున్నారు. తాండూరు మున్సిపాలిటీలో పలు కాలనీలలో మురుగునీరు వస్తుందని వాపోతున్నారు. సకాలంలో పైప్‌లైన్ల మరమ్మతులు చేయకపోవడంతో ఈ దుస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో ఏఈతో పాటు వర్క్స్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.



నిధుల కోసం నిరీక్షణ

- వికారాబాద్ మునిసిపల్‌లో ఖజానా ఖాళీ
- సిబ్బందికి వేతనాలు ఇవ్వలేని పరిస్థితులు
- జనరల్ నిధులతోనే కాలం వెళ్లదీత
- ఏడాదిగా రాని పట్టణప్రగతి నిధులు

వికారాబాద్, జూలై 13 : జిల్లా కేంద్రమైన వికారాబాద్ మునిసిపాలిటీలో నిధుల కొరతతో కొట్టుమిట్టాడుతోంది. మునిసిపల్ పరిధిలో ప్రస్తుతం 34వార్డులు ఉండగా జనాభా లక్షకుపైగా ఉంటుంది. ప్రస్తుతానికి మునిసిపల్ జనరల్ ఫండ్‌తో పాటు 15వ ఫైనాన్స్ నిధులతో వికారాబాద్ మునిసిపాలిటీని నెట్టుకొస్తున్నారు. ఉన్న నిధులు సరిపోక పోవడంతో మునిసిపల్‌లో సమస్యలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. గతంలో జనరల్ ఫండ్, 14, 15వ ఫైనాన్స్ నిధులతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పట్టణ ప్రగతి కింద మునిసిపల్, గ్రామ పంచాయతీలకు రూ. 20 నుంచి 25 లక్షల వరకు నిధులు కేటాయించేది. అయితే ఆ నిధులు ఏడాది నుంచి రావడం లేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ పట్టణ ప్రగతి కింద నిధులు వస్తాయా.. లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

జీతాలు ఇవ్వలేని పరిస్థితులు

వికారాబాద్ మునిసిపాలిటీలో ఎక్కువగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. కంప్యూటర్ సెక్షన్ ఒక్కొక్కరికి రూ.23,500, డ్రైవర్లకు రూ. 20 వేలు, కార్మికులకు రూ.16,600 చొప్పున వేతనాలు చెల్లిస్తున్నారు. శానిటేషన్ విభాగంలో కార్మికులు 157 మంది వరకు విధులు నిర్వహిస్తున్నారు. వీరందరికి కూడా జనరల్ ఫండ్ నుంచి వేతనాలు ఇవ్వాల్సి ఉండగా, ఆ నిధులు ఏకోశాన సరిపోవడం లేదు.






త్వరలో కౌన్సిల్ సమావేశం

త్వరలో మునిసిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని భావిస్తున్న పాలకవర్గం ముందు ప్రస్తుతం శానిటేషన్ అతిముఖ్యమైన సమస్యగా మారింది. దీనికి తోడు గతంలో హరితహారం స్థానంలో కొత్త ప్రభుత్వం వనమహోత్సవం పేరిట మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న మున్సిపాలిటీకి వనమహోత్సవం నిర్వహణ ఇబ్బందిగా మారింది. దీనికితోడు వచ్చేది పండుగల సీజన్.. ప్రతి వాడలో బోనాల పండుగకు అంతర్గత రోడ్లు, గుంతల పూడ్చడం విద్యుత్‌లైట్ల ఏర్పాటు, వినాయక మండపాలు, నిమజ్జన ఏర్పాట్లు బాగానే ఖర్చుతో కూడుకున్నవి కావడంలో పాలక వర్గం తలలు పట్టుకుంటుంది.

ప్రత్యేక నిధుల కోసం ఎదురు చూపు

ప్రస్తుత పాలకవర్గం ఏర్పడి నాటి నుంచి ప్రత్యేక నిధులు పెద్దగా రాకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే తాండవిస్తున్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు గడుస్తుండడంతో కొత్తగా ఏమైనా మునిసిపాలిటీలకు ప్రత్యేక నిధులు వస్తాయేమోనని ఆశతో ఉన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా వాసులే కావడంతో ప్రత్యేక నిధులు వస్తాయని ఆశతో ఉన్నారు.

ప్రత్యేక నిధుల కోసం కృషి చేస్తున్నాం



వికారాబాద్‌మునిసిపల్‌కు ప్రత్యేక నిధుల కోసం కృషి చేయడం జరుగుతుంది. ఇప్పటికే స్పీకర్ ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. ఆరు నెలల్లో వికారాబాద్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తాం.

- మంజుల రమేష్, మునిసిపల్ చైర్‌పర్సన్ , వికారాబాద్

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

కొందుర్గు, జూలై 13: పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని రాంచంద్రాపూర్‌లో సీపీఐ మండల నిర్మాణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చిందని, అందులో భాగంగా ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి స్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరుచేసి, నిర్మాణం కోసం రూ.5లక్షలు ఇస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తుచేశారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావస్తున్నా.. ఇళ్లు మంజూరు చేయలేదని, గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూంలు అంటూ కొన్ని చోట్ల మాత్రమే ఇళ్లు నిర్మించిందని, లబ్ధిదారులకు అందజేయలేదని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూంలకు మరమ్మతులు చేయించి లబ్ధిదారులకు అందజేయాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు బుద్దుల జంగయ్య మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఏనెగడ్డలో 2007లో 74 మందికి ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారని, ప్రస్తుత ప్రభుత్వం స్థలాల లబ్ధిదారులకు అక్కడే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, నిర్మాణాలు చేయించాలని కోరారు. అనంతరం కొందుర్గు మండల నూతన కౌన్సిల్‌ను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. కార్యదర్శిగా బి.నర్సింహ, కార్యవర్గ సభ్యులుగా జి.యాదయ్య, సి.సురేష్, భూపాల్, బందెమ్మ, పి.యాదమ్మ, బాలకృష్ణయ్యలను ఎన్నిక చేసినట్లు జంగయ్య వివరించారు. కార్యక్రమంలో జి.వెంకటేష్, ఎం.కృష్ణ, చిల్కమ్మ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య

ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి

- వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి
- దోమ పోలీస్ స్టేషన్‌లో రికార్డుల పరిశీలన


రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి

దోమ, జూలై 13: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో పోలీసులు మర్యాదపూర్వకంగా మెలగాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. శనివారం దోమ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌తో కలిసి ఎస్పీ నారాయణ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్ పరిసరాలు, క్వార్టర్స్ భవనం, రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి సమస్యలు, కేసులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ నారాయణరెడ్డి మాట్లాడుతూ విధి నిర్వాహణలో ఉన్న ప్రతీ పోలీసు అధికారి పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. వారి నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేసి ఫాలోఅప్ చేయాలని ఆయన సూచించారు. ప్రతీ ఫిర్యాదుదారుడికి సత్వర న్యాయం జరిగేలా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. డయల్ 100కు కాల్ చేసిన వెంటనే స్పందించి ఘటన స్థలానికి చేరుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో నిఘా పటిష్ఠంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక, గంజాయి, డ్రగ్స్, గుట్కా వంటి మత్తుపదార్థాల విక్రయాలపై ప్రత్యేక నిఘాతో కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు ఎస్పీకి పోలీసు సిబ్బంది గౌరవ వందనం చేసి పూల మొక్కలతో ఆహ్వానించారు.

నూతన చట్టాలపై అవగాహన కలిగించాలి

నూతన చట్టాలపై ప్రజలకు గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఎస్పీ నారాయణ రెడ్డి సూచించారు. ప్రతీఒక్కరూ నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ప్రజలకు చట్టాలపై అవగాహన కలిగితే గ్రామాల్లో శాంతిభద్రతల సమస్యలు ఉండవని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై ఆనంద్‌కుమార్, ఏఎస్సై సూర్యనారాయణ, హెడ్ కానిస్టేబుళ్లు నర్సింలు, భీమ్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, కానిస్టేబుళ్లు పురుషోత్తం, నరేశ్, నారాయణరెడ్డి, మాధవి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు గొప్ప స్థాయికి ఎదగాలి

- మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్ టౌన్, జూలై 13 : చదువు పూర్తి చేసుకుని పట్టాలు పుచ్చుకున్న విద్యార్థులు భవిష్యత్తులో గొప్ప స్థాయికి ఎదిగి దేశ అభివృద్ధికి పాటుపడాలని మల్లారెడ్డి విద్యాసంస్థల వ్యవస్థాపక ఛైర్మన్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. శనివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ మల్లారెడ్డి యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ స్నాతకోత్సవం, ఎంఆర్ఈసీలో నిర్వహించిన 19వ గ్రాడ్యుయేషన్‌డే వేడుకల్లో మల్లారెడ్డి పాల్గొని విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ చదువు పూర్తిచేసి ఉద్యోగాలకు పరిమితం కాకుండా భవిష్యత్తులో మరిన్ని ఉన్నత చదువులు చదివి మంచి స్థాయికి ఎదిగి సమాజానికి ఉపయోగపడేలా సేవలందించాలన్నారు. సాంకేతిక రంగంలో ఇంజినీర్లు, వ్యవసాయ రంగంలో ఆగ్రికల్చర్ విద్యార్థులు సేవలందించి గుర్తింపు పొందాలన్నారు. తమ కళాశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులకు మంచి ప్లేస్‌మేట్స్ లభిస్తున్నాయన్నారు. చాలామంది విదేశాలకు వెళ్లి మంచి ఉద్యోగాలు చేస్తూ స్థిరపడ్డారని అన్నారు. ఇంతటితో చదువును ఆపకుండా ఉన్నత చదువులు చదివేందుకు ప్రయత్నించాలని కోరారు. అగ్రికల్చర్ బీఎస్సీ చదివిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. సమాజంలో అందరికీ అన్నం పెట్టే రంగంలో పనిచేసే అవకాశం లభిస్తుందన్నారు. బీఎస్సీ పూర్తిచేసుకున్న విద్యార్థులు గ్రూప్ పరీక్షలు రాసి ప్రజలకు సేవచేసే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ రంగంలో మాస్టర్స్ చదివే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉందని, ప్రపంచంలో ఎక్కడికు వెళ్లినా మంచిస్థాయిలో స్థిరపడుతారన్నారు. తమ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులు గొప్పస్థాయిలో స్థిరపడి మంచి పేరును సంపాదించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ డీన్ రాజారెడ్డి, ఎంఆర్ఈసీ డీన్, కళాశాలల అధ్యాపకులు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


అగ్రికల్చర్ విద్యార్థినికి పట్టా అందజేస్తున్న డీన్ రాజారెడ్డి


మట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

లక్ష్యం దిశగా ముందుకు సాగాలి

- విద్యార్థులకు ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి యతిరాజులు సూచన
- సింబియాసిస్ యూనివర్సిటీలో ఇండక్షన్ ఫెస్టివల్

నందిగామ, జూలై 13: విద్యార్థులు లక్ష్యం దిశగా ముందుకు సాగాలని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జి.యతిరాజులు అన్నారు. నందిగామ మండల పరిధిలోని మొదళ్ళగూడ శివారులో గల సింబియాసిస్ యూనివర్సిటీ న్యాయ కళాశాలలో ఫ్రెషర్స్‌కు వారం రోజులపాటు నిర్వహించిన ఇండక్షన్ ఫెస్టివల్ కార్యక్రమం శనివారం ముగిసింది. కళాశాల డైరెక్టర్స్‌తో కలిసి మాజీ న్యాయమూర్తి జస్టిస్ జి.యతిరాజులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ 5 ఏళ్ల న్యాయవిద్యను అభ్యసించే విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, వాటిని సమర్థవంతగా అమలు చేయవలసిన ఆవశ్యకతను వివరించారు. క్రమశిక్షణతో మెలగాలని, గురువులను గౌరవిస్తూ ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. న్యాయవ్యవస్థలో వస్తున్న మార్పులను నిరంతరం చర్చించాలని సూచించారు. మారుతున్న సామాజిక అవసరాల నిమిత్తం మతం, సంఘం, సంస్కృతుల్లో మార్పులు అనివార్యమని, వాటిని ఆహ్వానించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా జి.యతిరాజులును కళాశాల డైరెక్టర్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సంతోష్ అగావ్, అధ్యాపకులు అనురాధ, శ్రీనివాస్, శాంతి, అనిత సబ్లె, శాంసన్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


యతిరాజులును సన్మానించి జ్ఞాపిక అందజేస్తున్న కళాశాల డైరెక్టర్ సంతోష్ అగావ్

హైకోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా అనంతసేన్‌రెడ్డి

వికారాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ జిల్లాకు చెందిన ఆకుల అనంతసేన్‌రెడ్డిని హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా నియమిస్తూ న్యాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మర్పల్లి మండలం, ఖిల్లోడ గ్రామానికి చెందిన అనంతసేన్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా కోర్టుల న్యాయవాదుల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా పనిచేయగా, అదే కోర్టులో సుదీర్ఘకాలం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. గత రెండు పర్యాయాలుగా తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులుగా కొనసాగుతున్న అనంతసేన్‌రెడ్డి క్రమశిక్షణా సంఘం ఛైర్మన్‌గా, తెలంగాణ న్యాయవాదుల సంక్షేమ నిధి సంఘం కోశాధికారిగా సేవలు అందిస్తున్నారు. అంతే కాకుండా అనంతసేన్‌రెడ్డి రాజా బహదూర్ వెంకటరామారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ (బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్) సభ్యులుగా, ఎస్ఏపీ కళాశాల నిర్వహణ బాధ్యతలు పర్యవేక్షించే వికాస్ మండలి సంయుక్త కార్యదర్శిగా కొనసాగుతున్నారు. హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా ఆయన మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. అనంతసేన్‌రెడ్డి తండ్రి ఆకుల లాల్ రెడ్డి కూడా ప్రముఖ న్యాయవాదిగా రాణించారు. అంతే కాకుండా ఆయన పంచాయతి సమితి అధ్యక్షుడిగా, వికాస మండలి కార్యదర్శిగా విశిష్ట సేవలు అందించారు. హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా నియామకమైన అనంతసేన్‌రెడ్డిని యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోలుకుంద సంతోష్ కుమార్ అభినందించారు.


అనంతసేన్‌రెడ్డి


శ్రీనివాసరావు

జిల్లా కోర్టు ప్రభుత్వ ప్లీడర్‌గా శ్రీనివాస్‌రావు

ఇదిలా ఉంటే, వికారాబాద్ జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టులో ప్రభుత్వ ప్లీడర్‌గా స్థానిక న్యాయవాది శ్రీనివాసరావు నియమితులయ్యారు. జిల్లా కోర్టులో ప్రభుత్వ ప్లీడర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూనే.. జిల్లా అదనపు జడ్జి కోర్టుతో పాటు సీనియర్ సివిల్ జడ్జి, జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో కూడా ప్రభుత్వ ప్లీడర్‌గా ఆయన అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

దురదృష్టం.. దూసుకొచ్చిన మృత్యువు

- కొత్తూర్ వై జంక్షన్ వద్ద జరిగిన ప్రమాదంలో లారీకింద పడి ప్రాణాలు కోల్పోయిన రైతు
- ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యుల వేడుకోలు


అంజయ్య(ఫైల్)

కొత్తూర్, జూలై 13: ప్రభుత్వం ఇచ్చిన అర ఎకర పొలంలో చాలీచాలని వ్యవసాయం.. మరోపక్క డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్న ఆ వ్యక్తిని దురదృష్టం వెంటాడింది. మృత్యువు రూపంలో దూసుకొచ్చిన లారీ ఆ రైతు ప్రాణాన్ని బలిగొన్న తీరు కుటుంబసభ్యులతో పాటు పలువురిని కంటతడి పెట్టించింది. మండల కేంద్రానికి సమీపంలో 44వ జాతీయ రహదారిపై వై జంక్షన్ వద్ద శుక్రవారం ఓ లారీ డీసీఎంతో పాటు మరో లారీని ఢీకొన్న ఘటనలో అంజయ్య(50) అనే వ్యక్తి దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. మండల పరిధిలోని పెంజర్ల గ్రామానికి చెందిన అంజయ్య.. ప్రభుత్వం ఇచ్చిన అర ఎకర పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయం మీద వచ్చే అదాయం సరిపోకపోవడంతో, ప్రైవేట్‌గా డ్రైవర్ చేరాడు. ఈ క్రమంలో అతడు శుక్రవారం విధులు ముగించుకొని స్కూటీపై స్వగ్రామానికి వస్తుండగా.. దినేష్ అనే యువకుడు లిఫ్ట్ అడగడంతో ఇద్దరూ కలిసి వస్తున్నారు. ఇంతలో షాద్‌నగర్ వైపు నుంచి హైదరాబాద్ వైపుల లోడ్‌తో వెళ్తున్న భారీ ట్రైలర్ లారీ ముందు వెళ్తున్న డీసీఎంను ఢీకొంది. ఆ తర్వాత కుడి వైపుకు వెళ్లి హైదరాబాద్ నుంచి తమిళనాడు వెళ్తున్న లారీని ఎదురుగా వెళ్లి ఢీకొనడంతో బోల్తాపడింది. అయితే, అదే సమయంలో లారీ పక్క నుంచి వెళ్తున్న అంజయ్య స్కూటీపై లారీ పడడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. అంజయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

సాగునీటి సంఘాలకు ఎన్నికలెప్పుడో?

- చివరిసారిగా 2006లో నిర్వహణ
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం
- అధ్వానంగా మారుతున్న నోటిఫైడ్ చెరువులు


ఇప్పాయిపల్లి కొత్త చెరువు, మరమ్మతుకు నోచుకోని తూము(ఇన్‌సెట్లో)

కులకచర్ల, జూలై 13: రాష్ట్రంలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు గత పదహారేళ్లుగా నిర్వహించడం లేదు. దాంతో చెరువులు అధ్వానంగా మారాయి. మరోవైపు మిషన్ కాకతీయ పథకంలో భాగంగా గత ప్రభుత్వం చెరువులు, కుంటలకు మరమ్మతులు చేసినా వాటిపై ఆజమాయిషీ లేక నీటి విడుదల, మరమ్మతులపై దృష్టి పెట్టేవారు కరువయ్యారు. చెరువుల అభివృద్ధి కోసం గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మిషన్ కాకతీయ పథకానికి శ్రీకారం చుట్టింది. ఒకప్పుడు చెరువుల అభివృద్ధి, నిర్వహణ, ఆయకట్టుకు నీటి సరఫరా చేయడం తదితర పర్యవేక్షణ పనులు నీటి సంఘాలు, పాలకవర్గాలు చేపట్టేవి. పదహారేళ్లుగా ప్రభుత్వాలు నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించకపోవడంతో పర్యవేక్షణ కరువైంది.

సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో ఇలా..

గతంలో ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నోటిఫికేషన్ విడుదల చేయగానే 100 ఎకరాలు ఉన్న ప్రధాన చెరువుల ఆయకట్టుకు రైతులు చైర్మన్‌తో పాటు డైరెక్టర్‌లను ఎన్నుకునేవారు. పాలకవర్గ సభ్యులు చెరువుల నిర్వహణతో పాటు నీటిని పంట పొలాలకు విడుదల చేసుకొని పొదుపుగా వాడుకునేలా చర్యలు తీసుకునేవారు. అంతేకాకుండా రైతులను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులు నిర్వహించేవారు. 16 ఏళ్ల నుంచి సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో చెరువుల నిర్వహణ అధ్వానంగా మారింది. కొన్ని చెరువులు శిథిలావస్థకు చేరుకున్నాయి. తూములు పని చేయక, సాగునీరు రాక నిరుపయోగంగా మారాయి.

2008 నుంచి సాగునీటి సంఘాలకు ఎన్నికల్లేవు

కులకచర్ల ఉమ్మడి మండలంలో వందల ఎకరాలు ఆయకట్టు.. అంతకంటే ఎక్కువగా ఉన్న చెరువులు 10 ఉన్నాయి. కులకచర్ల షైలమ్మ చెరువు, కామునిపల్లి కాముని చెరువు, ముజాహిద్‌పూర్ అక్కమ్మ చెరువు, అల్లాపూర్ చెరువు, కొత్తపల్లి చెరువు, మరికల్ మల్కాచెరువు, చాకల్‌పల్లి చెరువు, చెల్లాపూర్ చెరువులు ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2006లో రాష్ట్ర వ్యాప్తంగా వందల ఎకరాల ఆయకట్టు ఉన్న ప్రధాన చెరువులకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. వాటి పదవీకాలం 2008లో ముగిసింది. అప్పటి నుంచి తిరిగి ఎన్నికలు నిర్వహించిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి చెరువులను మరింత అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

సాగునీటి సంఘాలతోనే చెరువుల అభివృద్ధి



నీటి సంఘాలను ఎన్నుకుంటేనే చెరువులు అభివృద్ధి చెందుతాయి. గతంలో నీటి సంఘాలు ఉండటంతో నీటిని పొదుపుగా వాడుకోవడమే కాకుండా వాటి పర్యవేక్షణ కూడా పకడ్బందీగా ఉండేది. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం పేరుతో చెరువులను అభివృద్ధి చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం నీటి సంఘాలపై దృష్టి సారించాలి.

- ఆనంద్, రైతు, ఇప్పాయిపల్లి

ఎన్నికల నిర్వహణకు ఎలాంటి ఆదేశాలు లేవు



ఇది ప్రభుత్వ పరిధిలోని అంశం. ప్రభుత్వం నుంచి సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఆదేశాలు వస్తే తప్పకుండా నిర్వహిస్తాం. ప్రస్తుతం ఈ విషయంలో ప్రభుత్వ ఆదేశాలు అంతిమ తీర్పు.

- మురళీధర్, కులకచర్ల తహసీల్దార్

అస్తవ్యస్తం.. 'ప్రత్యేక పాలన'

- అధికారుల అలసత్వంతో తాగునీటి కటకట
- బోరు మోటార్లు పాడైనా పట్టించుకోని వైనం
- సక్రమంగా లేని మిషన్ భగీరథ నీటి సరఫరా

పెద్దేముల్, జూలై 13 : ప్రత్యేకాధికారుల పాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి అవసరాలు తీర్చే బోర్లు పాడైనా పట్టించుకోవడం లేదు. మిషన్ భగీరథ నీరు రానిరోజు డైరెక్ట్ పంపింగ్‌ల వద్ద మహిళలు యుద్ధమే చేయాల్సి వస్తోంది. పెద్దేముల్ మండలంలో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన అనంతరం గ్రామాలకు ప్రత్యేకాధికారులను నియమించినా.. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలమవుతున్నారు. గ్రామాలను సందర్శించి సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులు గ్రామ పర్యటనలే చేయడం లేదు. అప్పుడప్పుడూ చుట్టు పుచూపుగా వచ్చిపోతున్నారు. సమస్యలు ప్రస్తావన రాగానే పంచాయతీలో నిధులు లేవని చేతులెత్తేస్తుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలోని రుక్మాపూర్‌లో ఓవర్‌హెడ్ ట్యాంకు ఉంది. దానికి నీటిని సరఫరా చేసే బోరు కూడా ఉంది. అయితే, రెండు నెలలుగా బోరుమోటార్ పనిచేయడం లేదు. మిషన్ భగీరథ నీరు వస్తే తాగునీటికి ఇబ్బందులేమీ ఉండవు. కానీ, ఈ మధ్య నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. బోరు మోటార్ కాలిపోవడంతో రెండు నెలలుగా పట్టించుకోవడం లేదు. అదేవిధంగా మంబాపూర్ గ్రామంలో కూడా రెండు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. జనం తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డైరెక్ట్ పంపింగ్‌ల వద్ద నీటికోసం యుద్ధమే చేయాల్సి వస్తుందని జనం వాపోతున్నారు. ప్రత్యేకాధికారులు తక్షణమే సమస్యలు పరిష్కరించాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.


రుక్మాపూర్ గ్రామంలోని ఓవర్ హెడ్‌ట్యాంక్, మరమ్మతుకు నోచుకోని బోరు మోటార్(ఇన్‌సెట్లో)

సనాతన ధర్మ స్థాపనకు 'సైకిల్ యాత్ర'

- ఢిల్లీకి చెందిన రాజేందర్ శర్మ సంకల్పం
- అయోధ్య రామ మందిరం నుంచి ఏడు రాష్ట్రాలు దాటి తెలంగాణలోకి..
- 50వేల కిలోమీటర్ల యాత్రకు శ్రీకారం
- తాండూరు చేరిన సైకిల్ యాత్ర



తాండూరు, జూలై 12: హింధూ ధర్మ పరి రక్షణ కోసం ఓ యువకుడు సైకిల్ యాత్ర చేపట్టారు. ఈక్రమంలో శనివారం ఆ యువకుడి సైకిల్‌యాత్ర తాండూరుకు చేరుకుంది. దేశ రాజధాని ఢిల్లీకి చెందిన రాజేందర్ శర్మ ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామ మందిరం నుంచి సైకిల్‌పై సంపూర్ణ భారత్ యాత్రకు శ్రీకారం చుట్టారు. మార్చి 13న ఆయన ప్రారంభించిన ఈ యాత్ర ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను దాటుకుంటూ తెలంగాణలోకి ప్రవేశించింది. కాగా, 50వేల కిలోమీటర్ల సైకిల్ యాత్రను చేపట్టిన శర్మ 12 ద్వాదశ జ్యోతిర్లింగాలు, 51 శక్తి పీఠాలు, చార్‌ధామ్, పంచకేదార్, తదితర పుణ్యక్షేత్రాలు పర్యటించి స్వగ్రామం చేరుకుంటారని తెలిపారు. అయితే, యాత్రలో భాగంగా సనాతన ధర్మంపై ప్రచారం చేస్తూ రాత్రివేళ దేవాలయాల వద్ద విశ్రాంతి తీసుకుంటానని, ప్రతీ రోజు 70-80 కిలోమీటర్లు సైకిల్‌పై యాత్ర కొనసాగిస్తున్నట్లు శర్మ మీడియాకు వెల్లడించారు. ఈమేరకు తాండూరులో ఆ యువకుడిని పలువురు నాయకులు, స్థానిక ప్రజలు అభినందించారు. ఆయన ఇప్పటివరకు 8వేల కిలోమీటర్ల యాత్ర పూర్తిచేసినట్లు చెప్పారు.

డిప్యూటీ సీఎం భట్టిని కలిసిన ఎమ్మెల్యే యాదయ్య



చేవెళ్ల, జూలై 13 : ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య శనివారం నగరంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధి గురించి చర్చించినట్లు ఎమ్మెల్యే యాదయ్య పేర్కొన్నారు.

20వేల మొక్కలు నాటడమే లక్ష్యం

- తలకొండపల్లి ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్
- చుక్కాపూర్ గ్రామంలో వనహోత్సవం
- స్థానికులతో కలిసి 300 ఈతమొక్కలు నాటిన సీఐ


చుక్కాపూర్‌లో నిర్వహించిన వనమహోత్సవంలో సీఐ బద్యనాథ్ చౌహాన్, సిబ్బంది, స్థానికులు

తలకొండపల్లి, జూలై 13: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 20 వేల ఈత, తాటి, కర్జూర మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ తెలిపారు. వవనహోత్సవం కార్యక్రమంలో ప్రజలంతా పలు పంచుకోవాలని ఆయన కోరారు. తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామంలో శనివారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వనహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. స్థానిక జంగారెడ్డి వ్యవసాయ పొలంలో సుమారు 300 ఈత మొక్కలను స్థానికులు, ఎక్సైజ్ సిబ్బంది తో కలిసి నాటారు. ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో వన మహోత్సవం కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొక్కల పెంపకం ప్రాధాన్యతను ప్రజలంతా గుర్తెరిగి మసులుకోవాలని ఆయన సూచించారు. భావితరాల మనుగడను దృష్టిలో ఉంచుకొని ప్రతీ ఒక్కరు ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటి సంరక్షించాలని అన్నారు. నాటు సారా నిరోధానికి ఎక్సైజ్ శాఖ చేపడుతున్న చర్యలకు ప్రజలంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సైలు అరుణ్‌కుమార్, స్వప్న, సిబ్బంది నర్సింహ, బాబు, ప్రవీణ్‌రెడ్డి, ఆమని తదితరులు పాల్గొన్నారు.

సైకిళ్లపై 'పోలీసు పెట్రోలింగ్'

ఆదిభట్ల, జూలై 13 : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పోలీసులకు అందించిన సైకిళ్లపై పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్నారు. ఈమేరకు శనివారం ఆదిభట్ల ఎస్సైలు బాల్‌రాజు, రాజులు మహిళా కానిస్టేబుళ్లు సైకిళ్లపైనే వెళ్లి సాధారణ ప్రజలతో తిరుగుతూ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా వారు స్థానికులతో మాట్లాడారు. పోలీసులకు సహకరించాలని వారికి సూచించారు.


పెట్రోలింగ్‌లో భాగంగా విద్యార్థులతో మాట్లాడుతున్న పోలీసులు

జోరుగా రోడ్డు విస్తరణ పనులు


అంతారం శివారులో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు

తాండూరు రూరల్, జూలై 13: తాండూరు-సంగారెడ్డి ప్రధాన రోడ్డు మార్గంలో రోడ్డు విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. తాండూరు పట్టణ శివారులోని ఎన్టీఆర్ కాలనీ నుంచి అంతారం గ్రామ శివారులోని రింగ్‌రోడ్డు వరకు నాలుగు లైన్ల రోడ్డు మంజూరైంది. రోడ్లు, భవనాల శాఖ రూ.15కోట్ల నిధులు విడుదల చేసింది. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు రోడ్డు పనులు యుద్ధ ప్రాతిపదికన సాగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా యంత్రాల సాయంతో మట్టిని చదునుచేస్తున్నారు. ఎన్టీఆర్ కాలనీ నుంచి అంతారం రింగ్ రోడ్డు వరకు 2.5కిలో మీటర్ల మేర లైన్ల రోడ్డు పనులు త్వరలో పూర్తి చేస్తామని ఆర్అండ్‌బీ డీఈ శ్రీనివాస్ తెలిపారు. ఇట్టి పనులను వర్క్ ఇన్‌స్పెక్టర్ లాలప్ప దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు


శ్రీకాంత్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 13: తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్‌ను శనివారం మేడ్చల్ నియోజకవర్గం బీబ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఆయనను కోరారు. రాష్ట్ర ఓబీసీ సెల్ కో-ఆర్డినేటర్ పవన్‌గౌడ్, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు రవి, మండల నాయకులు బింగి రాజేందర్‌గౌడ్, నరేష్‌గౌడ్ శ్రీకాంత్ గౌడ్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

ఉచిత వైద్యసేవలు అభినందనీయం


ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నారాయణరెడ్డి

పెద్దేముల్, జూలై 13: గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందించడం అభినందనీయమని కోట్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సాయిని నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని మంబాపూర్ గ్రామంలో శనివారం స్థానిక చర్చి ప్రాంగణంలో మిల్లేనియం మెథడిస్ట్‌చర్చ్, సికింద్రాబాద్ మెథడిస్టుమెన్ సహకారంతో ఉచితవైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎస్.నారాయణరెడ్డి హాజరై మెథడిస్ట్ సభ్యులను అభినందించారు. ఈ శిబిరంలో మొత్తం 191మందికి వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈకార్యక్రమంలో మెథడిస్టుమెన్ ప్రెసిడెంట్ వరకుమార్, రెవ ఆర్.శామ్యుల్, కె.జనార్దన్, జి.తిమోథి, మాజీ ఎంపీటీసీ యాలటి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

హైకోర్టు ఏజీపీని కలిసిన నాయకులు


అనంత్‌సేనరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చంద్రయ్య, లాల్‌కృష్ణ

పరిగి, జూలై 13: వికారాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ న్యాయవాది అనంత్‌సేనరెడ్డి హైకోర్టు ఏజీపీగా నియమితులైన సందర్భంగా శనివారం పరిగి ప్రాంతానికి చెందిన మాజీ జడ్పీటీసీ పి.చంద్రయ్య, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.లాల్‌కృష్ణప్రసాద్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మర్పల్లి మండలం ఖల్కోడ గ్రామానికి చెందిన అనంత్‌సేనరెడ్డి హైకోర్టు ఏజీపీగా నియమితులవడం గర్వకారణమన్నారు.

శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ బీఎస్ రావుకు ఘన నివాళి


బీఎస్ రావు ప్రథమ వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ, అధ్యాపకులు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 13: విద్యావేత్త శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ బీఎస్ రావు (బొప్పెన సత్యనారాయణ రావు) ప్రథమ వర్ధంతిని అవుషాపూర్‌లోని శ్రీ చైతన్య కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో బీఎస్ రావు చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే బీఎస్ రావు లక్ష్యమన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలుగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో డీన్లు విజయ్, టీఎస్ఆర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పరిగి, జూలై 13: విద్యాశాఖలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని పరిగి డివిజన్ పరిధిలోని ఉద్యోగులు కోరారు. ఈ మేరకు పరిగికి శనివారం వచ్చిన టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్రప్రధానకార్యదర్శి రవికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గాంగ్యానాయక్, మహిళా అధ్యక్షురాలు స్వప్న, మేసెంజర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, ఉద్యోగ సంఘాల నాయకులు మోహన్, రాఘవేందర్, నజీర్, జంగయ్య తదితరులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

కీసర, జూలై 13: ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కీసర సహకార సంఘం చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రం కీసరలోని శ్రీ ప్రసన్నాంజనేయ సామి ఆలయానికి దాదాపు రూ.60వేల విలువ చేసే హుండీని రామిడి ప్రభాకర్‌రెడ్డి విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచులు రమేష్‌గుప్తా, కీసరగుట్ట ట్రస్ట్ బోర్డుసభ్యులు శ్రావణ్ కుమార్ గుప్తా, గుర్రం లక్ష్మారెడ్డి, నత్తి రెడ్డి, టి.వెంకటేష్, నల్లా వెంకట్‌రెడ్డి, రాజిరెడ్డి, రాఘవేందర్, జూపల్లి అశోక్, శీలం సురేష్, రమేష్ యాదవ్‌లతో పాటు అర్చకుడు మహనంద శర్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

పరిగి, జూలై 13: విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా ఆదివారం పరిగి మండల పరిధిలో విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏఈ ఎండీ ఖాజా తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు. బహార్‌పేట్, హనుమాన్ టెంపుల్, వాగ్దేవి ఆస్పత్రి ఏరియా, వల్లభ్‌నగర్, హైదరాబాద్ రోడ్, రంగాపూర్‌తండాలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కుటుంబ సంక్షేమ నిధి స్ఫూర్తిదాయకం

● పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


అంజుమ్‌జహన్ సంస్మరణ సభలో బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

పరిగి, జూలై 13: టీఎస్‌యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ నిధి ఉపాధ్యాయ సమాజానికి స్ఫూర్తి దాయకమని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం పరిగి ఏకేఆర్ గార్డెన్‌లో నిర్వహించిన కేజీబీవీ ఉపాధ్యాయురాలు అంజుమ్ జహన్ సీఆర్‌టీ సంస్మరణ సభకు ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. తెలంగాణ ఐక్య ఫెడరేషన్ సభ్యులకు ఏర్పాటుచేసిన కుటుంబ సంక్షేమ నిధి, ఎస్‌డబ్ల్యూఎఫ్ మహా అద్భుతమని కొనియాడారు. ఇది సమాజానికి స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. ఉపాధ్యాయ సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల ద్వారా 67 వేల మంది ఉపాధ్యాయులకు న్యాయం జరిగిందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చెల్లించడానికి ప్రభుత్వ ఖజానా ఖాళీగా ఉందన్నారు. ఖజానా కోలుకున్న వెంటనే వాటికి సంబంధించి బడ్జెట్ విడుదల చేస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యకు ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తున్నారని చెప్పారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చావ రవి, కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, టీచర్స్ మాసపత్రిక సంపాదకులు మాణిక్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం, కార్యదర్శి రాములు, ఉపాధ్యక్షులు నర్సింహులు, నాయకులు జాఫర్‌పల్లి వెంకటయ్య, మల్లేశం, కృష్ణవేణి పాల్గొన్నారు. అనంతరం అంజుమ్ కుటుంబ సభ్యులకు రూ.6లక్షల చెక్కును అందజేశారు.

బస్ సర్వీసులు పెంచాలి


ధారూరు: స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ధారూరు, జూలై 13: మండలంలోని నాగారం గ్రామానికి వికారాబాద్ నుంచి బస్ సర్వీసులను పెంచాలని అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు వారు శనివారం హైదరాబాద్‌లోని స్పీకర్ నివాసంలో ఆయనకు వినతిపత్రం అందజేశారు. వికారాబాద్ నుంచి వయా తరిగోపుల మీదుగా ప్రస్తుతం రెండు ట్రిప్పులు మాత్రమే బస్సును నడిపిస్తున్నారని వారు స్పీకర్ దృష్టికి తెచ్చారు. ఆ తర్వాత వికారాబాద్‌కు వెళ్లాలంటే నాగారం, మైలారం, తరిగోపుల, జైదుపల్లి, గోధమగూడ ప్రయాణికులకు బస్సుసౌకర్యం లేక ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించాల్సి వస్తోందని తెలిపారు. దీంతో ఈమార్గంలో ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వికారాబాద్ నుంచి నాగారం గ్రామానికి బస్సు ట్రిప్పులను పెంచేలా చూడాలని వారు స్పీకర్‌ను కోరారు. స్పీకర్‌ను కలిసిన వారిలో మాజీ సర్పంచ్ కిరణ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అనంతయ్య, తుకారం, నర్సింహులుగౌడ్, శ్రీనివాస్ ఉన్నారు.

పాఠశాల భవనానికి నిధులివ్వండి

నవాబుపేట: మండల పరిధిలోని మైతాబ్ ఖాన్‌గూడ పాఠశాల భవనం శిథిలావస్థలో ఉండటంతో నూతన భవనానికి నిధులు మంజూరు చేయాలని శనివారం చేవేళ్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పామేనా భీమ్‌భరత్ ఆధ్వర్యంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పీకర్ సానుకూలంగా స్పందించి నిధుల మంజూర్‌కు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనితారంగారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ సామ వెంకట్‌రెడ్డి, వట్టిమీనపల్లి మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

పదవులు లేకున్నా ప్రజలకు సేవలందించాలి

● మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి


మాజీ వైస్ ఎంపీపీ జడల అన్నపూర్ణను సన్మానిస్తున్న రోహిత్‌రెడ్డి

బషీరాబాద్, జూలై 13: పదవులు లేకున్నా ప్రజల మధ్యలో ఉంటూ సేవలందించాలని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి అన్నారు. తాండూరులోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం రాత్రి బషీరాబాద్ మాజీ వైస్ ఎంపీపీ జడల అన్నపూర్ణ అనంతయ్య, ఎంపీటీసీ సభ్యులను వారి పదవీ కాలం ముగిసిన సందర్భంగా ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మట్లాడుతూ.. ఐదేళ్ల పాటు గ్రామాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిన వారి సేవలను ప్రజలు ఎప్పటికీ మరిచిపోలేరన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇందర్‌చెడ్ నర్సిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కృష్ణా, నాయకులు రవీందర్‌సింగ్, జడల అనంతయ్య, సునీల్‌ప్రసాద్, మాజీ ఎంపీటీసీలు సి.వినోద, లక్ష్మీబాయి, సురేష్, రథోడ్‌రాజు, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు రాజాక్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి


కళాశాలలో ఆడిటోరియం ప్రారంభిస్తున్న చైర్మన్ టీవీ గోపాలచారి, ఎగ్జిబిషన్ సొసైటీ చైర్మన్ సత్తేందర్

పరిగి, జూలై 13: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ముందుకు సాగాలని ఉస్మానియా గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్(ఓజీఏ) చైర్మన్ టీవీ గోపాలచారి, ఎగ్జిబిషన్ సొసైటీ చైర్మన్ వి.సత్తేందర్, కార్యదర్శులు హన్మంత్‌రావు, బీఎన్ రాజేశ్వర్, ప్రధాన ఆర్థిక కార్యదర్శి జి.రంగారెడ్డిలు పేర్కొన్నారు. శనివారం పరిగిలోని ఒగా అండ్ ఈఎస్ బీఈడీ కళాశాలలో కొత్తగా నిర్మించిన ఆడిటోరియం, అదనపు తరగతి గదులను వారు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కళాశాలలో కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని, భవిష్యత్‌లో ఉన్నతస్థితిలో స్థిరపడానికి కృషి చేయాలన్నారు. కళాశాలలో బోధనోపకరాలను, అధ్యాపకులు ఉపయోగించుకుని సమాజానికి ఉపయోగపడే విధంగా ఎదగాలని సూచించారు. ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతి రోజు కళాశాలకు వచ్చి అధ్యాపకులు బోధించే వాటిని క్షుణ్ణంగా విని చదువుకోవాలని సూచించారు. ఒగా, ఎగ్జిబిషన్ సొసైటీ కళాశాలల్లో ఇతర కళాశాలలకు భిన్నంగా బోధన, పాలనా విధానం ఉంటుందన్నారు. ఇక్కడ విద్యను అభ్యసించిన వారు కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఒగా అండ్ ఈఎస్ పరిగి బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్‌రెడ్డి, కాళాశాల కార్యదర్శి రవీంద్రనాథ్, కోశాధికారి బోపతిసాయిబాబా, పాలకవర్గ సభ్యులు, అధ్యాపకులు, ఛత్రోపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం బంగారు పతకం సాధించిన విద్యార్థులను సన్మానించి ఆర్థిక సాయం అందజేశారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

● టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి


సమావేశంలో మాట్లాడుతున్న చావ రవి

పరిగి, జూలై 13: బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు. పరిగిలో శనివారం జరిగిన టీఎస్‌యూటీఎఫ్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిదేళ్ల సుదీర్ఘకాలం తర్వాత బదిలీ అయిన ఉపాధ్యాయులను వారు కోరుకున్న ప్రాంతాలకు పంపించాలని కోరారు. లెఫ్ట్ ఓవర్ వేకెన్సీస్‌ను పదోన్నతుల ద్వారా నింపి విద్యారంగ అభివృద్ధికి చేయూతనందించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో పారిశుధ్య కార్యక్రమాలు గత ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. ఈ ప్రభుత్వం అలా కాకుండా చూడాలని కోరారు. బడ్జెట్‌లో 15శాతం నిధులను విద్యాశాఖకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం, ఎఫ్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శి రాములు, వీహోటీటీ సంపాదకమండలి సభ్యులు వెన్నెల సత్యం, నాయకులు కె.వెంకటయ్య, జమున, నర్సింహులు, మోహిజ్ ఖాన్, కృష్ణవేణి, మల్లేశం పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

దౌల్తాబాద్, జూలై 13: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడతాయని ఎస్ఐ రవిగౌడ్ అన్నారు. మండలంలోని చంద్రకల్ గ్రామంలో దొంగతనాల కట్టడి, నేరాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాల ఏర్పాటు, ఆవశ్యకతపై పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో దొంగతనాలను అరికట్టవచ్చని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానస్పదంగా వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

తిరుపతిరెడ్డిని కలిసిన తండావాసులు


తిరుపతిరెడ్డిని సన్మానిస్తున్న తండావాసులు

కొడంగల్ రూరల్, జూలై 13: టేకుల్‌కోడ్ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం మొత్కులబండ తండాలో గతంలో విద్యుత్ సమస్య కారణంగా తీవ్ర ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి ఉండేదని తండావాసులు తెలిపారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి సహకారంతో తండాలో త్రీఫేస్ విద్యుత్ సరఫరా కోసం ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడంతో విద్యుత్‌సమస్య తీరిందని తెలిపారు. దీంతో శనివారం హైదరాబాద్‌లో తిరుపతిరెడ్డిని కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు తార్యానాయక్ ఆధ్వర్యంలో తండావాసులు సామ్యానాయక్, గోపాల్‌నాయక్, నర్సయ్యనాయక్, సికింద్రనాయక్, అంజిలప్ప తదితరులు మార్యదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు


పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బొంరాస్‌పేట్, జూలై 13: కుదురుమళ్ల మండలం నుంచి దాదాపూర్ శివారు పోలెపల్లి, హకీంపేట, దుద్యాల మీదుగా రోడ్డువిస్తరణకు ప్రభుత్వం రూ.50కోట్లు మంజూరు చేసిందని కాంగ్రెస్ దుద్యాల మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్ తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులను శనివారం ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మెరుగు వెంకటయ్య, పోలెపల్లి నర్సింహా, దుద్యాల మాజీ సర్పంచ్ ఖాజమీయ, కృష్ణ, శ్రీశైలం గౌడ్, సింగర్ నర్సింహ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

లేని ప్లాట్ అమ్ముతామని మోసం.. ఇద్దరు రిమాండ్


మీరాల గణేష్


వల్లపు మహేష్

ఘట్‌కేసర్ రూరల్, జూలై 13: లేని ప్లాట్ అమ్ముతామని డబ్బులు తీసుకుని మోసగించిన ఇద్దరు రియల్ వ్యాపారులను ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టు చేసి శనివారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు. సీఐ సైదులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, కేశవనగర్‌లో ఓ ప్లాట్ విక్రయిస్తామని, ప్లాట్ యజమాని వద్ద అగ్రిమెంట్ చేసుకున్నామని ఎదులాబాద్‌కు చెందిన మీరాల గణేష్, ఘట్‌కేసర్, బుగ్గానగర్‌కు చెందిన వల్లపు మహేష్, మక్కల శ్రీకాంత్, వెంకిర్యాల్‌కు చెందిన యాకరి గణేషలు చౌదరిగూడకు చెందిన గొట్టిపాముల సుదర్శన్ వద్ద రూ.9లక్షల 80వేలను అడ్వాన్స్‌గా తీసుకున్నారు. కొద్దిరోజుల నుంచి రిజిస్ట్రేషన్ చేయించకుండా కాలయాపన చేస్తుండటంతో సుదర్శన్ ప్లాట్ గురించి విచారించాడు. ఈ క్రమంలో ప్లాట్ ఒరిజినల్ యాజమాని నుంచి వీరు అగ్రిమెంట్ చేసుకోకుండానే తన వద్ద డబ్బులు తీసుకున్నారని గ్రహించాడు. మోసపూరితంగా తనకు ప్లాట్ అమ్ముతామని అగ్రిమెంట్ చేసిన గణేష్, మహేష్, శ్రీకాంత్, యాకరి గణేష్‌లను తిరిగి తనకు డబ్బులు ఇవ్వమని సుదర్శన్ అడిగాడు. పలుమార్లు డబ్బులు అడిగినా స్పందించకపోవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. మీరాల గణేష్, వల్లపు మహేష్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శ్రీకాంత్, యాకరి గణేష్‌లు పరారీలో ఉన్నారని, ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చైన్‌స్నాచర్ రిమాండ్


అజ్మీర వెంకటేష్

ఘట్‌కేసర్ రూరల్, జూలై 13: మద్యానికి బానిసై దొంగతనాలకు పాల్పడుతున్న ఓ యువకుడిని ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టుచేసి శనివారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు. క్రైం ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌కు చెందిన పంది దనంజయ్య ఈనెల 12న ఘట్‌కేసర్‌లో ఉండే బంధువులైన బుడ్డ బాలయ్య ఇంటికి కుటుంబసభ్యులతో కలిసి వచ్చారు. అదేరోజు సాయంత్రం ఘట్‌కేసర్‌లో కూరగాయల సంతలో కూరగాయలు కొనడానికి కుటుంబసభ్యులతో కలిసి దనంజయ్య వచ్చాడు. కూరగాయాలు తీసుకుంటుండగా అతడు పశువుల అసుపత్రి సమీపంలో నిలబడి ఉండగా ఘట్‌కేసర్‌కు చెందిన అజ్మీర వెంకటేష్ వచ్చి అకారణంగా ధనంజయ్యతో గొడవ పడి అతడి మెడలో ఉన్న బంగారు, వెండి గొలుసులను లాక్కెళ్లాడు. పట్టుకునే ప్రయత్నం చేయగా అతడు అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో దనంజయ్య పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు అజ్మీర వెంకటేష్‌ను శనివారం అరెస్టుచేసి సాయంత్రం రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు క్రైం ఎస్ఐ తెలిపారు.

బాలుడితో పనులు చేయిస్తున్న వ్యక్తిపై కేసు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 13: మెకానిక్ షెడ్‌లో ఓ బాలుడితో పనులు చేయిస్తున్న యజమానిపై పోచారం ఐటీసీ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చెంగిచెర్లకు చెందిన వాపనగిరి లక్ష్మణ్ పోచారం మున్సిపాలిటీ, అన్నోజిగూడ తులిప్ హోటల్ సమీపంలో లారీ మెకానిక్ షెడ్‌లో బాలుడు(14)తో పనులు చేయిస్తున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు తనిఖీచేసి బాలుడిని గుర్తించి అదుపులోకి తీసుకొని జువైనల్ హోంకు తరలించారు. యజమాని లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత


విద్యుదాఘాతంతో మృత్యువాతపడిన గేదె

యాలాల, జూలై 13: విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత పడింది. ఈ ఘటన శనివారం యాలాల మండల పరిధిలోని పగిడ్యాల గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు ముక్కిడి నర్సింహులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముక్కిడి నర్సింహులు గ్రామంలో తనకున్న గేదెతో జీవనం కొనసాగిస్తున్నాడు. శనివారం సాయంత్రం గ్రామంలోని కోళ్ల బావి దగ్గరకు గేదె వెళ్లింది. అప్పటికే విద్యుత్ స్తంభం వైర్ తెగి కిందకు వేలాడడంతో గేదెకు ఆ వైరు తగలడంతో అక్కడికక్కడే మృత్యువాతపడింది. మృత్యువాతపడిన గేదె విలువ రూ.70వేలకు పైగా ఉంటుందని బాధితుడు నర్సింహులు తెలిపాడు. విద్యుత్‌శాఖ అధికారులు తమకు న్యాయం జరిగేలా చూడాలని ఆయన కోరారు.

కలెక్టర్ చెంతకు తాండూరు సమస్యలు

తాండూరు, జూలై 13: తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రధానమైన సమస్యలు కలెక్టర్ చెంతకు చేరాయి. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి శుక్రవారం, బీజేపీ నేతలు గురువారం, కౌన్సిలర్లు కలెక్టర్‌ను కలిసి ప్రధాన సమస్యలను విన్నవించారు. ప్రధాన సమస్య అయిన కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు అవసరమయ్యే షెడ్ నిర్మాణానికి ఎమ్మెల్యే కోటానిధుల నుంచి రూ.10లక్షలు కేటాయించాలని కోరారు. చిలుక వాగు పునరుద్ధరణ, పాత తాండూరు రైల్వే బ్రిడ్జి వద్ద 40 ఫీట్ల రోడ్డు నిర్మాణం, తెలంగాణ-కర్నాటక సరిహద్దు ప్రాంతమైన బషీరాబాద్‌లో భూ సమస్య పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా బీజేపీ నాయకులు తాండూరు మున్సిపాలిటీలో ఐదు నెలలుగా నిర్వహించని మున్సిపల్ సమావేశం నిర్వహించేలా చూడాలని కోరారు. ఈ మేరకు త్వరలో కలెక్టర్ ప్రతీక్ జైన్ వచ్చే వారం అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించే అవకాశాలున్నాయి. విన్నపాలను సంబంధిత అధికారులకు పంపించి నివేదిక కోరనున్నారు.

మాజీ ఎమ్మెల్యే తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

తాండూరు, జూలై 13: ఎన్నికల్లో ఓటమి తర్వాత తాండూరుకు చుట్టపుచూపుగా వచ్చే మాజీఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి.. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కుటుంబంపైన తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, డీసీసీబీ డైరెక్టర్ రవిగౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, ఉత్తంచంద్‌లు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. మనుగడ కోసమే రోహిత్‌రెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. తాండూరు ఇసుక, మైనింగ్, మాఫియా గత పాలనలో జరిగిందని ఆరోపించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఎన్నికైన తర్వాత సక్రమ రవాణాతో రెండు నుంచి మూడు కోట్లు డీడీ రూపంగా ఆదాయం వచ్చిందని చెప్పారు. రోహిత్‌రెడ్డి అప్పటో లారీలు పెట్టించి ఇసుక తరలించారని తెలిపారు. ఫెనాన్స్ క్లియరెన్స్ నిధులు మంజూరు కాకుండా కమిషన్ల కోసం పనుల చేయించి కాంట్రాక్టర్లను అప్పులపాలు చేయించాడని దుయ్యబట్టారు. 2009లోనే తాండూరుకు బైపాస్ రోడ్డు మంజూరైతే అది తాను చేయించానంటూ గొప్పలు చెబుతున్నాడని విమర్శించారు. చిలుకవాగు కబ్జాలు, అక్రమాలు మాజీ ఎమ్మెల్యే హయాంలోనే జరిగాయన్నారు. ఈ సమావేశంలో కోట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాల, కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు శోభారాణి, కౌన్సిలర్ ప్రభాకర్‌గౌడ్, రాము తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ కార్మికుల సమస్యలపై యాజమాన్యంతో చర్చ

తాండూరు రూరల్, జూలై 13: సీసీఐ కార్మికుల సమస్యలపై యాజమాన్యంతో శనివారం చర్చించినట్లు తాండూరు మండలం సీఐటీయూ నాయకులు శరణప్ప, సీసీఐ కార్మిక సంఘం నాయకులు అనంతయ్య, నాగేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సీసీఐ నిర్వాహకులు అమిత్‌రంజన్‌తో మాట్లాడామని పేర్కొన్నారు. వీడీఏ పేమెంట్ పెరిగి మూడు నెలలు అవుతున్నా ఇంతవరకు కార్మికులకు అందించడం లేదని, కాంట్రాక్ట్ కార్మికులకు వేజ్‌బిల్లు ఇవ్వడం లేదని, ఈ విషయమై పలుమార్లు మీ దృష్టికి తీసుకువచ్చామని గుర్తుచేసినట్లు తెలిపారు. కార్మికులకు ఎంత జీతం వస్తుందని, ఎంత పీఏఫ్ కట్ అవుతుందో, పేమెంట్ ఎంత వస్తుందనేది తెలియని పరిస్థితి ఉందని చెప్పారు. పేమెంట్ స్లిప్ విషయం చిన్న సమస్య కూడా పరిష్కరించని స్థితిలో సీసీఐ యాజమాన్యం ఉందని వాపోయారు. ఉద్యోగ విరమణ పొందిన కాంట్రాక్ట్ కార్మికులకు గ్రావిటీ 1972ప్రకారం ఇవ్వకుండా ఇష్టానుసారంగా ఇస్తున్నారని, దీంతో కార్మికులు అయోమయానికి గురవుతున్నారని అన్నారు. చాలా సమస్యలతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నట్లు వివరించామని సీసీఐ కార్మిక సంఘం నాయకులు అనంతయ్య, నాగేందర్‌లు తెలిపారు.

రేపు ఎంఐఎం ఆధ్వర్యంలో ధర్నా

కొడంగల్ రూరల్, జూలై 13: కొడంగల్‌లో శిథిలావస్థకు చేరిన షాదీఖానాను ఎవరూ పట్టించుకోకపోవడంతో సోమవారం షాదీఖానా ముందు ధర్నా నిర్వహించనున్నట్లు ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్కేగుల్షన్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. షాదీఖానా శిథిలావస్థకు చేరిందని, నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూర్ చేయాలని పలుమార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో సోమవారం ఎంఐఎం ఆధ్వర్యంలో ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ధర్నాకు కార్యకర్తలు, మైనారిటీలు విజయవంతం చేయాలని కోరారు.